పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం గురువారం వైద్యులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఇళ్లతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ నివారణ సాధ్యమని వైద్యులు సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. అంతకుముందు అన్ని మండలాల్లో ర్యాలీ నిర్వహించారు.

- అవగాహన కల్పించిన వైద్యులు
- ఘనంగా డెంగీ నివారణ దినోత్సవం



పెద్దవడుగూరు: ర్యాలీలో పాల్గొన్న డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్

గార్లదిన్నె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, మంజుల మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. అలాగే డెంగీ వ్యాధి రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవంను పురస్కరించుకుని యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీల్లో గురువారం వైద్యాధికారులు శ్రీరామ్‌కుమార్, దేవరాజన్ వైద్య సిబ్బందితో చేయి..చేయి కలుపుదాం...డెంగీ వ్యాధిని నివారిద్దాం వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ప్రజలకు డెంగీ, మలేరియా గురించి, దోమల ద్వారా వ్యాపించు చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధి, బోధకాలు వ్యాధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల: డెంగీ రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలు జ్వరం వచ్చిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని మండల వైద్యాధికారి శంకరనాయక్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని గురువారం శింగనమలలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. డెంగీ దోమ నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో వృద్ధి చెందుతుందని, ఎక్కవ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వని, సూపర్‌వైజర్ ఆశ్వర్థ, బాబా ఫక్రుద్దీన్, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం కొర్రపాడు, బీకేఎస్ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వరకూ, కొర్రపాడులో వీధుల్లో ర్యాలీ కొనసాగింది. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మి స్వాతి, తెహరున్నీసా, వినోద్‌కుమార్ సీహెచ్‌ఓలు మోహన్‌కుమార్, మోహన్‌బాబు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ ఎడుకేటర్ పర్వీన్ బేగం, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి పెట్టాలి

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ దోమల నివారణపై దృష్టి పెట్టాలని డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. గురువారం పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీపీఎంఓ తనిఖీ చేశారు. అనంతరం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్య పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం గ్రామానికి దూరంగా వేయాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సూపర్ వైజర్ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శృతి, పావని, ఏఎన్‌ఎమ్ సువర్ణ, హెల్త్ అసిస్టెంట్ జఫీవుల్లా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



యాడికి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బీకేఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

వీణా వినోదిని అలంకారంలో వాసవీమాత



తాడిపత్రి అర్బన్: జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం కన్యకాపరమేశ్వరీదేవి వీణా వినోదిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వైశాఖ శుద్ధ అష్టమి రోజు కావడంతో ఆర్యవైశ్యులు తమ ఇష్టదైవమైన వాసవి మాతకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 10 గంటలకు వాసవీదేవికి లక్ష పుష్పార్చన కార్యక్రమం చేపట్టారు. వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళారతి నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు వాసవీ మాత వీణావినోదిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులైయ్యారు.

ఆర్బీకేలకు సబ్సిడీ వేరుశనగ

గార్లదిన్నె: మండలంలోని అన్ని ఆర్బీకేలకు సబ్సిడీ విత్తన వేరుశనగ సరఫరా అవుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. గురువారం ఏఓ మాట్లాడుతూ మండలానికి 1400 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు కేటా యించారని, అందులో భాగంగా మర్తాడు, కోటంకలోని ఒక్కో ఆర్బీకేకు వంద క్వింటాళ్లు చొప్పున రెండు వందల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయన్నారు. మిగిలిన ఆర్బీకేలకు వారం రోజుల్లో విత్తన వేరుశనగ సరఫరా అవుతాయన్నారు. రైతులకు సకాలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: మండలంలోని దయ్యాలకుంటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డీలర్ వెంకటేశు ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకుని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు గురువారం పరామర్శించారు. వెంకటేశు ఆరోగ్య పరిస్థితి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ శివారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడిడ్డి, కాటమయ్య, సాకే లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థ అధ్యక్షుడిగా గుర్రప్ప



తాడిపత్రి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యల్లనూరు రోడ్డులోని వివేకానంద పాఠశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా కుమ్మర గుర్రప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా కుమ్మర రామాంజనేయులు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా పుల్లారెడ్డి, శ్రీరంగయ్య, రామదాసు, రాధ, కన్వీనర్‌గా శంకర్, కో కన్వీనర్‌గా కరుణాకర్, గౌరవాధ్యక్షుడిగా చెన్నెకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పతంగి నాగభూషణరావు, మహిళా కన్వీనర్‌గా కె.విజయలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు



గాయపడిన అభిషేక్

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న నర్సరీలో బుధవారం రాత్రి అభిషేక్ అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. వివరాలు.. గుత్తికి చెందిన అభిషేక్ నర్సరీలో ఫ్యాన్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

పెద్దవడుగూరు: మండల కేంద్రమైంలోని జెడ్పీ పాఠశాల ప్లస్ అయిందని, ఇందులో ప్రభుత్వం ఇంటర్ మీడియట్ ఎంపీసీ, సీఈసీ గ్రూపులను ఏర్పాటు చేసిందని ఎంఈఓ రాముడు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పాసైన విద్యార్థినీ విద్యార్థులకు జెడ్పీ పాఠశాలలో ఉండే ఇంటర్ మీడియట్ కళాశాలలో అడ్మిషన్ సూచించారు. కళాశాలలో ఎంపీసీలో 40 సీట్లు, సీఈసీకి 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం మండలంలో జూనియర్ కళాశాల మంజూరు చేయడం హర్షించతగ్గ విషయమని అన్నారు. అనంతరం మండలంలోని లక్ష్మంపల్లిలో ప్రధానోపాధ్యాయుడు హరినాథ్ ఇంటర్ కళాశాల ప్రవేశానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



లక్ష్మంపల్లిలో ఇంటర్ కళాశాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు హరినాథ్

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యయురాలు వసుంధర గురువారం తెలిపారు. ఈ ఏడాది నుంచి బీకేఎస్ హైస్కూల్‌లో బాల, బాలికలకు ఇంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. వీటిలో ఎంపీసీ 40 సీట్లు, సీఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో సంప్రదించాలన్నారు.

మిశ్రమ బియ్యం సేకరణకు వేలం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సేకరణకు గురువారం వేలం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో నలుగురు పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన 1,500 కిలోల బియ్యం సేకరణకు తొండపాటు గ్రామానికి చెందిన రాజేష్ రూ.24,500కు పాటపాడి దక్కించుకున్నారు. అలాగే వీరేపల్లి గ్రామ శివారులో ఉన్న మాన్యం భూముల సాగుకు వేలం నిర్వహించగా రూ.14,500 చెల్లించేలా అదే గ్రామానికి చెందిన రైతు హనుమేష్ పాట దక్కించుకున్నట్లు ఈఓ రాణి తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఈఓ రాణి

హజ్ యాత్రికులకు ఘనసన్మానం



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న అంజుమన్ కమిటీ పెద్దలు

గుంతకల్లుటౌన్: ముస్లింల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజ్‌కు వెళ్తున్న యాత్రికులను గుంతకల్లు అంజుమన్ కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక అంజుమన్ కమిటీ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మతపెద్దలు హాఫీజ్ ఖలీలుల్ రహిమాన్, ఇస్మాయిల్, మన్నన్‌సాబ్‌లు పాల్గొని హజ్ ఆచరణ, ప్రాముఖ్యత గురించి వివరిస్తూ విశ్వశాంతి కోసం ప్రార్థనలు నిర్వహించాలని సూచించారు. హజ్ యాత్రికుల కోసం ప్రభుత్వం వివిధ భాషల్లో రూపొందించిన యాప్‌లు, అత్యవసర సమయాల్లో వినియోగించుకోవా ల్సిన హెల్ప్‌డెస్క్, కంట్రోల్ రూమ్ వివరాలను వారు వివరించారు. హజ్‌యాత్రకు వెళ్తున్న వారికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌరవాధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్, సంయుక్త కార్యదర్శి అబ్దుల్‌వహాబ్, సభ్యులు ఆర్‌డీజీ బాషా, వలిబాషా, అఫ్రోజ్‌ఖాన్, షాషావలి, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న షిరిడీ సాయి బాబా ఆలయ 31వ వార్షిక వేడుకలు గురువారం ముగిశాయి. షిరిడీసాయి భక్త మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు సంయుక్తంగా మంగళవారం వేడుకలు ప్రారంభించారు. మూడో రోజు అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, సంధ్యా హారతి వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీకె రాము, సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.అందులో భాగంగా శుక్రవారం పతాక ఆవిష్కరణ, గణపతి పూజ, నవగ్రహాల పూజ, అభిషేకం, శనివారం ఉదయం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో రేపు అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 132 ఈహెచ్‌టీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ రంగస్వామి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కసాపురం, ఆదర్శనగర్, పాతకొత్తచెరువు, నాగసముద్రం, వజ్రకరూరు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పట్టణ, గ్రామీణ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కళ్యాణోత్సవం, శ్రీవారి రథోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, అధ్యక్ష, కార్యదర్శులు గెల్లి రామరాజు, రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 11:30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి గరుడసేవ (రథోత్సవం) జరుగుతుందన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవం భక్తులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి


బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. గురువారం స్వామి వారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

20 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రసన్న వెంకటరమణస్వామి, అమ్మవార్ల మూలవిరాట్

- విశిష్ట సంప్రదాయంతో 25న శ్రీవారి కల్యాణోత్సవం
- 27న బ్రహ్మ రథోత్సవం



కోటలో వెలసిన ఆలయ ముఖద్వారం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం కోటలో వెలసిన పట్టణానికే తలమానికం ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు మే 20 నుంచి 30 వరకు జరుగుతాయని గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు. వందేళ్ల నుంచి కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా 25న తొమ్మిదేళ్ల బాలికతో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 27న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం జరగనుంది.

శ్రీవారి ఉత్సవ కార్యక్రమాలు:
ప్రసన్న వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా మే 20న కలశస్థాపన, రక్షాబంధనం, 21న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ వాహనం, 23న శ్రీవారి శేష వాహనోత్సవం, 24న హనుమద్ వాహనం, 25న కల్యాణోత్సవం, గరుడ వాహనోత్సవం, 26న గజేంద్ర వాహనం, 27న మడుగు తేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం, 28న పార్వేటోత్సవం, అశ్వ వాహనం, బాణసంచా వేడుక, 29న వసంతోత్సవం, మయూర వాహనం, 30న నప్త శయనోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేటి నుంచి యోగాసనా పోటీల శిక్షణ శిబిరం

అనంతపురం కల్చరల్: రాష్ట్రస్థాయి యోగాసనా పోటీల న్యాయనిర్ణేతల శిక్షణ శిబిరం ఈనెల 17 నుంచి 19 వరకు జరగనుంది. ఈ మేరకు వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని వేమన టెలీఫోన్ భవన్ వేదికగా యోగాసన భారత్ అనే జాతీయ స్థాయి సంస్థ నిర్దేశం ప్రకారం కోడ్ ఆఫ్ రూల్స్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కల్గిన యోగా శిక్షకులు శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. మరన్ని వివరాలకు 9963028694 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యటన



వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలో జిల్లా వైద్యటాస్క్ ఫోర్స్ కమిటీ గురువారం పర్యటించింది. మండలంలోని వెంకటాంపల్లిలో ఉన్న హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేసింది. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించింది. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌లో అందుతున్న సేవలపై ఆరాతీశారు. 2023 ఏప్రిల్‌నుంచి 2024 మార్చి వరకు మాతాశిశుసంరక్షణ పథకానికి సంబంధించి అందిన వివరాలు, సేవలపైనా ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు గోవి ందగౌడ్, జరీనా, హేమలత, గంగాధర్, వైద్యధికారి సర్దార్ వలి, ఎంపీహెచ్ఈఓ గు రుప్రసాద్, హెచ్ఈ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు నాగశంకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మెరుగైన సేవలు



పసికందుకు 2 డీ ఎకో పరీక్ష చేస్తున్న దృశ్యం



అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో ఎక్స్‌రే తీస్తున్న దృశ్యం



జీజీహెచ్‌లో ఎంఆర్‌ఐ పరికరం

- రూ.వేల ఖర్చుతో కూడుకున్న సేవలు ఉచితం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో ప్రసవ సమయంలో గర్భిణులు, అప్పుడే పుట్టిన పసికందులకు 2డీ ఎకో (గుండె పరీక్షలు) వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీంతో పాటు ఆర్థో, సర్జరీ విభాగాల శస్త్రచికిత్సలకు 2డీ ఎకో పరీక్ష ప్రామాణికంగా మారింది. సర్వజనాస్పత్రిలోని 2 డీ ఎకో పరీక్ష కేంద్రంలో సోమ, గురు, శనివారాల్లో 200 వరకు 2 డీ ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ లెక్క రోజూ 70 పరీక్షలు జరుగుతున్నాయి. వీటితో పాటు ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. రోజూ 30 నుంచి 40 ఎంఆర్ఐ, 30 సిటీ స్కాన్ సేవలందిస్తున్నారు. వీటితో పాటు అల్ట్రాసౌండ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర విభాగమైన అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, చిన్నపిల్లల వార్డులో ఎక్స్‌రేలు తీయడానికి మొబైల్ ఎక్స్‌రే మిషన్లను ఏర్పాటు చేశారు. టెక్నీషియన్లు అక్కడికే వెళ్లి రోగులకు ఎక్స్‌రేలు తీస్తున్నారు. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.1,000 నుంచి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.